నేటి నుంచి పదో తరగతి పరీక్షలు షురూ



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో హాల్ టికెట్ నెంబర్లు రాస్తున్న ఉపాధ్యాయులు

ముషీరాబాద్: పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో మొత్తం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4807 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు.

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గంగపుత్ర సంఘం నేతలు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర ప్రదేశ్ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి ఆధ్వర్యంలో నాయకులు గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సంఘం ఉపాధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నీల వెంకటేష్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీల నిరంతర పోరాట ఫలితంగానే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింప చేశారని నీల వెంకటేష్ అన్నారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



అంబర్‌పేట: చిన్నారుల యూకేజీ గ్రాడ్యుయేషన్ వేడుకలు సంబురంగా జరిగాయి. గురువారం బాగ్అంబర్‌పేటలోని డ్రీమ్స్ కిడ్స్‌లో యూకేజీ విద్యార్థులకు పట్టాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్, కరస్పాండెంట్ సంతోషిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణియార్‌పట్టిలో మంచినీటి ఎద్దడి

కాచిగూడ: మణియార్‌పట్టిలో మంచినీటి ఎద్దడి సమస్య తీవ్రతరం కావడంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను తెలుసుకున్న కార్పొరేటర్ ఉమారాణి వెంటనే స్పందించి గురువారం జలమండలి అధికారులను పిలిపించి నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంచినీటి పైపులైన్ కిందకు కుంగిపోవడంతో నీరు సరిగా రావడం లేదని తెలిపారు. పైపులైన్‌ను సరిచేసి సమస్యను పరిష్కరించామని తెలిపారు. జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ యాదవ్, బీజేపీ నేతలు బల్వీర్, రవి, రాము, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, సతీష్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చేనేతకు బడ్జెట్‌లో నిరాశే మిగిలింది

చిక్కడపల్లి: చేనేతకు బడ్జెట్‌లో నిరాశ మిగిలిందని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు అన్నారు. గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీలు పాలకులు చేనేతల పట్ల మొదటి నుంచి కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. చేనేత, పవర్ లూమ్, కార్మికుల అభివృద్ధి కోసం ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాక ముందు చేనేతలకు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.371 కోట్లు మాత్రమే చేనేత, పవర్‌ను పరిశ్రమలకు కేటాయించి మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.2000కోట్లు బడ్జెట్‌లో ప్రవేశపెట్టలేదన్నారు. ఈ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రంలో చేనేత కార్మికులు 32 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత వర్గాల చైతన్య వేదిక నాయకులు శ్రీధర్, లక్ష్మి, గీత, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిక్కాదేవదాసు, శ్రీధర్, లక్ష్మి, గీత, జనార్దన్

బీసీల సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించలేరా?: గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి తగినంత నిధులు కేటాయించకపోవడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం విమర్శించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి ఏటా బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందని ఆయన మండిపడ్డారు. గత బడ్జెట్‌లో రూ.9,300 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించడం బీసీలకు తీవ్ర అన్యాయమన్నారు. రూ.3లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కనీసం రూ.20వేల కోట్లు కేటాయించలేరా అని ఆయన ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో కేటాయించిన విధంగానే ఈసారి కూడా నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటాయించిన తక్కువ నిధులను సైతం పూర్తిగా ఖర్చు చేయకపోవడం కూడా బీసీలను మోసం చేసినట్లేనని అన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం : రాజేందర్

కాచిగూడ: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం చేశారని బడ్జెట్‌లో నిధుల తగ్గింపుపై తెలంగాణ బీసీ సంఘం మండిపడింది. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ.. జనాభాలో 56.39 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో భిక్ష వేసినట్లు కేవలం రూ.11.405 కోట్లు మాత్రమే కేటాయించడం బీసీల గొంతు కోసినట్లేనన్నారు. బీసీ సంక్షేమానికి అరకొర నిధుల బడ్జెట్ ఏంటని ఆయన ప్రశ్నించారు. సామాజిక న్యాయం ప్రకారం బీసీలకు సగం వాటా దక్కాలని అన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాని బడ్జెట్‌లో మాత్రం బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. బీసీలను విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీల బడ్జెట్‌ను రూ.20 లక్షల కోట్లకు పెంచాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు వరికుప్పల భాషయ్య, బాలయ్య ముదిరాజ్, బాలస్వామి, ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బన్సిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్





టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు కృష్ణగౌడ్, నాగభూషణం, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

కాచగూడ: బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీకి నిజంగా బీసీలకు న్యాయం చేయాలని ఉంటే.. కేంద్రంలో కూడా ఈ బిల్లు ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వాన్ని, పార్టీ అధిష్టానాన్ని ఒప్పించాలని సూచించారు. బీసీలకు విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికలలో రాజకీయ రిజర్వేషన్లను 42శాతం పెంచుతూ ప్రవేశపెట్టిన బీసీ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షణీయమని అన్నారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు నాగభూషణం, తోలుపునూరి కృష్ణగౌడ్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

◆ బీసీ బిల్లు చట్టబద్ధతకు కృషి చేస్తాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ గౌడ కల్లుగీ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...బీసీ బిల్లు చట్టబద్ధతకు కృషి చేస్తామని ఆయన చెప్పారని తెలిపారు. దేశవ్యాప్తంగా జనగణన, కులగణన చేసేంత వరకు అనే రాహుల్‌గాంధీ నినాదాన్ని ఆచరణలో పెడుతున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

టీపీఆర్‌పీకి క్యారం బోర్డు గుర్తు కేటాయింపు

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్

కాచిగూడ: తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ (టీపీఆర్‌పీ)కి ఎన్నికల గుర్తుగా క్యారంబోర్డును రాష్ట్ర ఎన్నికల కమిషన్ కేటాయించిందని గురువారం ఓ ప్రకటనలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ తెలిపారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు క్యారం బోర్డుగుర్తును ఆదరించి పార్టీకి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో క్యారం బోర్డు గుర్తుతో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.



తెలంగాణ బడ్జెట్‌లో సేంద్రియ వ్యవసాయం ఊసేది?

ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య



కాచిగూడ: ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.3లక్షల కోట్లకు పైగా బడ్జెట్‌లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక ఇదులు కేటాయించకపోవడం అత్యంత బాధాకరమని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య, ఆవేదన వ్యక్తం చేశారు. అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకంతో ప్రకృతి, పర్యావరణ అసమతుల్యానికి కారణంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని సేంద్రియ వ్యవసాయంతో ప్రక్షాలన చేయాల్సిన ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడాన్ని విమర్శించారు. వ్యవసాయ రంగానికి రూ.25వేల కోట్ల కేటాయింపులు జరిగినా అందులో సింహభాగం రైతు భరోసాకు వెళ్తున్నాయని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, హైడ్రా చట్టాలతో పర్యావరణానికి ఊపిరి పోసిందనుకున్న ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని చిన్నచూపు చూసిందని రంగయ్య పేర్కొన్నారు. మానవ ఆరోగ్య ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తున్న వ్యవసాయ రంగాన్ని సేంద్రియ, ప్రకృతి సేద్యంతో ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని చిన్నచూపు చూడటం అంటే తరాల మనుగడను గుర్తించకపోవడమే అవుతుందన్నారు. ప్రభుత్వ పెద్దలు ఈ విషయాన్ని గుర్తించి తగినన్ని ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

'పిల్లి శ్రీనివాస్‌రావు మున్నూరుకాపులను తప్పదోవ పట్టిస్తున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాస్‌రావు తనకు తాను ప్రకటించుకుని మున్నూరుకాపులను తప్పుదోవ పట్టిస్తున్నారని మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. గురువారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభకు నిజమైన అధ్యక్షుడివే అయితే మున్నూరుకాపుల సమక్షంలో బహిరంగ చర్చకు వచ్చి అధ్యక్షుడిగా నిరూపించుకోవాలని పిల్లి శ్రీనివాస్‌రావుకు సవాల్ విసిరారు. పిల్లి శ్రీనివాస్‌రావుకు మహాసభకు ఎలాంటి సబంధం లేదని, అతనికి కనీసం జీవితకాల సభ్యత్వం కూడా లేదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహాసభ ప్రతినిధులు గంగం రవి, బీఆర్ జితేందర్, వినోద్‌కుమార్, రమేష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ విద్యార్థుల విదేశీవిద్యకు నిధుల కేటాయింపుపై హర్షం



బ్రాహ్మణ ప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞలు తెలియజేస్తున్న టీబీఎస్ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: పేద బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించేందుకై కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.30కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) హర్షం వ్యక్తం చేసింది. టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నల్లకుంటలో ప్రభుత్వానికి కృతజ్ఞత, ధన్యవాదాలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ.. బ్రాహ్మణుల మేలు కోరే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఐదేళ్ల పాటు ఎలాంటి విఘ్నాలు ఏర్పడవని ఆశీర్వదించారు. బ్రాహ్మణ విద్యార్థులకు బడ్జెట్ కేటాయించడంలో తమ వంతు కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, బీటీసీ చైర్మన్ సునీల్ కుమార్, డాక్టర్ వింజమూరి సుధాకర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీబీఎస్ఎస్ ప్రతినిధులు గంగు నవీన్ కుమార్ శర్మ, గూడ జయరాం, దూపదీప నైవేద్యం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, లక్ష్మీ నరసింహ శర్మ, అమర్నాథ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి అవతార శతాబ్ది మహోత్సవాలు

నల్లకుంట: సత్యసాయి బాబా శతాబ్ది మహోత్సవాలను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నల్లకుంట శివం ప్రాంగణంలో పది లక్షల సత్యసాయి ఫొటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరావు అధ్యక్షతన జరిగిననీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే. రత్నాకర్ సత్యసాయి ఫొటోను ఆవిష్కరించి మాట్లాడారు. సాయిబాబా లీలలను ఉద్ఘాటిస్తూ ఇది కేవలం ఫొటో మాత్రమే కాదని స్వామి అవతార ప్రవేశమని పేర్కొన్నారు. ఈ ఫొటో ఏ ఇంట్లో ఉంటే ఆ కుటుంబానికి అన్ని సౌఖ్యాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా సాయి సేవా సంస్థల 31 జిల్లాల అధ్యక్షులు, 104 కళాశాలల ప్రతినిధులకు సత్యసాయిబాబా చిత్ర పటాలను అందజేసి సత్కరించి సన్మానించారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కన్వీనర్ హెచ్‌జే. దొర, సత్యసాయి నేషనల్ సర్వీస్ కన్వీనర్ కోటేశ్వర రావు ప్రసంగించారు. సత్య సాయి సేవ సంస్థల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వర రావు మాట్లాడుతూ..హైదరాబాద్ జిల్లాల 104 కళాశాలల యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా జరిగిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గీతా రెడ్డి, సాయిబాబా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సత్యసాయి ఫొటోలను భక్తులకు అందజేస్తున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే. రత్నాకర్

దోమలగూడ హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. గతేడాది అక్టోబర్ నుంచి మార్చి వరకు లక్షా 40వేల 606 రూపాయలు హుండీ ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో దేవనాథం తెలిపారు. రాబోయే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అల్లం ప్రభు, మహేందర్, శేషాద్రి, భక్తులు కేఆర్‌కే ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరమేశ్వర్, వెంకట్ రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, సాయి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువ వికాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తహసీల్దార్‌కు వినితి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ మహిళ విభాగం నాయకులు

అంబర్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యువ వికాసం పథకానికి అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ఖైరాతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళ విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్ కోరారు. యువ వికాస పథకానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలంటూ ఆమె గురువారం అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయికి వినితి పత్రం అందించారు. యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ పథకంతో ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాకుతో గాయపరిచిన వ్యక్తి రిమాండ్

కాచిగూడ: మద్యం మత్తులో ఓ వ్యక్తిని చాకుతో గాయపరిచిన సంఘటనలో నిందితుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న తెలిపిన వివరాల ప్రకారం... ఢిల్లీకి చెందిన అస్మోద్దీన్ కుమారుడు ఫర్కన్ త్యైసీ(22) కాచిగూడలోని అమృత ఆర్కేడ్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఆంజర్ హుస్సేన్ కుమారుడు ఫర్కన్ (21) బుధవారం రాత్రి అన్నం వండే గిన్నెల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో ఫర్కన్ త్యైసి మద్యం మత్తులో ఆవేశం ఆపుకోలేక తన దగ్గర ఉన్న చాకుతో ఫర్కన్ చాతిపై దాడి చేశాడు. ఫర్కన్ ఫిర్యాదుతో కాచిగూడ ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని ఫర్కన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఫర్కన్ త్యైసీని పోలీసులు ఆదుపులోకి తీసుకున్నారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి



అరుంధతినగర్‌లో నూతన పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని, అధికారులు

చిక్కడపల్లి: అరుంధతినగర్‌లో తాగునీటి, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ పావని అన్నారు. గురువారం ఆమె జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలాం, మహేష్, ఇతర వాటర్‌వర్క్స్ అధికారులు శంకర్, జగన్‌తో కలసి ఆమె బస్తీలో పర్యటించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతమైన అరుంధతినగర్‌లో వర్షాకాలంలో వరద నీటి సమస్య అధికంగా ఉంటుందని అన్నారు. డ్రైనేజీ, తాగునీటి నూతన పైప్‌లైన్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ముదిరాజ్, సీనియర్ నేతలు రత్నసాయిచంద్, సత్తిరెడ్డి, ఉమేష్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గౌడల దీక్షను బహుజనులు విజయవంతం చేయాలి

గౌడ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర నాయకులు అంబాల నారాయణగౌడ్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జనగామ జిల్లా పేరు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని గౌడ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర నాయకులు అంబాల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గౌడ సంఘాల సమన్వయం వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఒక రోజు దీక్షలో బహుజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని గౌడ సంఘాల నాయకులంతా పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వంగ సదానందం గౌడ్, పరుశురాములు గౌడ్, సోమన్న గౌడ్, ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాలను తొలగించాలి

కవాడిగూడ: ఇందిరాపార్కు ప్రధాన ద్వారంలో ఏర్పాటు చేసిన నూతన విగ్రహాల వల్ల వాకర్స్‌కు నిత్యం ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వాకర్స్, బీజేపీ నేతలు ఆరోపించారు. ఇందిరాపార్కులో దారికి అడ్డంగా నిర్మించే నిర్మానాలను అడ్డుకుని తీరతామని వారు పేర్కొన్నారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఇందిరాపార్కులో టికెట్ కౌంటర్‌దాటిన వెంటనే వాకర్స్, సందర్శకులు వెళ్లే దారిలో భారీ విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల పార్కులోకి వచ్చే వాకర్స్, సందర్శకులు ఇబ్బందులు పడతారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఇందిరాపార్కులో దారికి అడ్డంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాల వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ ముదిరాజ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఇందిరాపార్కు ఎంట్రెన్స్‌లో దారికి అడ్డంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.



ఇందిరాపార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద నిరసన

సేవకు ప్రతిరూపాలు నర్సులు

డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ ప్రొ. విద్యుల్లత



లాంప్ లైటింగ్ సెర్మనీలో మాట్లాడుతున్న ప్రొ. విద్యుల్లత



నర్సింగ్ విద్యార్థిని శాస్త్రీయ నృత్య ప్రదర్శన

నల్లకుంట: నర్సింగ్ వృత్తి సాధారణమైనది కాదని, సేవకు ప్రతి రూపమని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ తెలంగాణ ప్రొఫెసర్ డీబీ విద్యుల్లత అన్నారు. నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి దేశవిదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. గురువారం నల్లకుంటలోని డీడీహెచ్ ఆర్‌సీ ఆడిటోరియంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ నర్సింగ్(డీడీసీవోపీ) బీఎస్సీ నర్సింగ్ 21వ బ్యాచ్, జీఎన్ఎం (స్కూల్ ఆఫ్ నర్సింగ్ స్కూల్) 34వ బ్యాచ్ విద్యార్థుల ల్యాంప్‌లైటింగ్ సెర్మనీ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యుల్లత నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. రోగులకు నిస్వార్థంగా ఉత్తమ సేవలు అందిస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు ఓ విద్యార్థిని ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డీఏంఎస్ అధ్యక్షురాలు ఉషాకంద, డీఎంఎస్ నర్సింగ్ యూనిట్ చైర్‌పర్సన్ జీఎల్‌కే దుర్గ, కార్యదర్శి డాక్టర్ ఎ. రమా దేవి, డీడీసీవోపి ప్రిన్సిపాల్ కె. శ్రావ్యస్పందన, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ బి. సింప్లీ, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.